డ్వాక్రా సంఘాల ప్రగతికి ప్రణాళిక

- మహిళల ఆర్థిక బలోపేతానికి ప్రభుత్వ చర్యలు
- నిర్వహణ తీరు ఆధారంగా గ్రేడింగ్

బిక్కవోలు: వైఎస్సార్ సీపీ ప్రభుత్వం సున్నా వడ్డీ పథకం అమలు చేసి, డ్వాకా సంఘాల మహిళల ఆర్థిక ఎదుగుదలకు బాసటగా నిలిచింది. తాజాగా రాష్ట్రంలో మహిళల ఆర్థిక స్వావలంబన లక్ష్యంగా ప్రభుత్వం కొత్త ప్రణాళికతో ముందుకు సాగుతోంది. స్వయం సహాయక సంఘాలను మరింత బలోపేతం చేసేందుకు వాటి పని తీరు ఆధారంగా గ్రేడింగ్ ఇచ్చే కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ప్రధానంగా 12 అంశాలకు సంబంధించి 100 మార్కులు కేటాయించి వాటి ఆధారంగా ఏ, బీ, సీ, డీ గ్రేడ్లుగా విభజిస్తున్నారు. ఏ గ్రేడ్ వచ్చిన మహిళా సంఘాలకు బ్యాంకు లింకేజ్ రుణాల మంజూరులో ప్రాధాన్యమివ్వనున్నారు. దీనివల్ల ఇంతకాలం స్తబ్దుగా ఉన్న సంఘాలు సైతం ఆర్థిక బలోపేతానికి కృషి చేసే అవకాశముంటుంది.

తుది దశలో గ్రేడింగ్ ప్రక్రియ

కొన్ని మహిళా సంఘాలు నిర్ణీత సమయానికి సమావేశాలు నిర్వహించకుండా, రుణ వాయిదాల చెల్లింపులో తీవ్ర జాప్యం చేస్తున్నాయి. ఈ క్రమంలో నూతన విధానాన్ని ప్రభుత్వం తెరపైకి తీసుకొచ్చింది. క్రమం తప్పకుండా సమావేశాల నిర్వహణ, సభ్యుల హాజరు, క్రమం తప్పని పొదుపు, పొదుపు పుస్తకాల నిర్వహణ, బ్యాంకు రుణ వాయిదాల చెల్లింపు తదితర అంశాల ఆధారంగా మార్కులు కేటాయిస్తున్నారు. 100 మార్కులకు గాను 80 మార్కులు పైగా ఉంటే 'ఏ' గ్రేడ్, 55 నుంచి 79 మార్కులుంటే 'బీ' గ్రేడ్, 30 నుంచి 54 మార్కులుంటే 'సీ' గ్రేడ్, 30 కంటే తక్కువ మార్కులుంటే 'డీ' గ్రేడ్ ఇస్తున్నారు. అనపర్తి నియోజకవర్గంలో 6,762 డ్వాకా సంఘాలకు గాను 6,677 సంఘాల గ్రేడింగ్ ప్రక్రియను ఇప్పటికే పూర్తి చేశారు. గ్రేడింగ్ ప్రక్రియ దాదాపుగా తుది దశకు చేరుకుంది.



పెదపూడిలో జరుగుతున్న డ్వాక్రా సమావేశం

అనపర్తి నియోజకవర్గంలో గ్రేడ్‌ల కేటాయింపు వివరాలు

మండలం	డ్వాక్రా సంఘాలు	ఏ గ్రేడ్	బీ గ్రేడ్	సీ గ్రేడ్	డీ గ్రేడ్	గ్రేడింగ్ చేయాల్సినవి
అనపర్తి	1,612	185	778	621	0	28
బిక్కవోలు	1,861	884	679	278	0	20
రంగంపేట	1,499	828	434	200	0	37
పెదపూడి	1,790	894	734	162	0	0
మొత్తం	6,762	2,791	2,625	1,261	0	85

మార్కులు కేటాయింపు ఇలా

అంశాలు	కేటాయించే మార్కులు
క్రమం తప్పకుండా సమావేశాల నిర్వహణ	5
సభ్యుల హాజరు	10
క్రమం తప్పని పొదుపు	10
పొదుపు పుస్తకాల నిర్వహణ	7
అప్పు వసూలు	8
సీఐఎఫ్ వసూలు	5
స్త్రీ నిధి వసూలు	10
ఇతర వసూలు	5
బ్యాంకు రుణ వాయిదాల చెల్లింపు	10
సంఘం రుణ వసూలు	10
సంఘం నుంచి బ్యాంకు చెల్లింపులు	10
మండల సమాఖ్య చెల్లింపులకు	10

సకాలంలో రుణాల చెల్లింపు



ప్రభుత్వం చేపట్టిన గ్రేడింగ్ పద్ధతి బాగుంది. సంఘాల పనితీరు ఆధారంగా గ్రేడింగ్ ఇస్తే ఆయా సంఘాలు మరింత బలోపేతమవుతాయి. దీంతో సకాలంలో రుణాలు చెల్లించేందుకు వీలవుతుంది. డ్వాక్రా సంఘాలు సక్రమంగా పనిచేయడానికి ఈ విధానం సంఘాల ఉన్నతికి దోహదపడుతుంది.

– బండారు రామలక్ష్మి, డ్వాక్రా సంఘం సభ్యురాలు, కొప్పవరం

డొల్లతనం బయటపడుతుంది



గ్రేడింగ్ విధానం అమలు చేయడం వల్ల పనిచేయని సంఘాల డొల్లతనం బయటపడుతుంది. సున్నా వడ్డీ, రుణాల మంజూరు, రుణమాఫీ తదితర లబ్ధి అర్హత ఉన్న సంఘాలకు మాత్రమే అందుతుంది. ఇది మంచి నిర్ణయం.

– కుక్కల కల్యాణి, డ్వాక్రా సంఘం సభ్యురాలు, పందలపాక

సంఘాల బలోపేతమే లక్ష్యం



స్వయం సహాయక సంఘాలను బలోపేతం చేయడమే లక్ష్యంగా గ్రేడింగ్ విధానం తీసుకొచ్చారు. క్రమం తప్పకుండా సమావేశాలు, పుస్తకాల నిర్వహణ, సభ్యుల హాజరు తదితర అంశాల్ని ప్రామాణికంగా తీసుకుని సంఘాలను నాలుగు గ్రేడులుగా విభజిస్తున్నాం. వాటి ఆధారంగా రుణాలు మంజూరు చేసి, మహిళల ఆర్థికాభివృద్ధికి బాటలు వేస్తాం.

– చిన్నబాబు, ఏపీఎం, వైఎస్సార్ క్రాంతి పథకం, పెదపూడి

క్లుప్తంగా

కాళీ కృష్ణభగవాన్‌ను దర్శించుకున్న ఎమ్మెల్యే



కాళీ కృష్ణభగవాన్‌కు పూజలు చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

రంగంపేట: వెంకటాపురంలో మల్లంపూడి శివ, అమ్మాజీల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కాళీ కృష్ణ భగవాన్‌ను ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి ఆదివారం దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ ముంగి గంగరాజు, వైఎస్సార్‌సీపీ కన్వీనర్ మాగాపు వెంకటరమణ, బోడెం రాంబాబు, మంగిన వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ వార్షికోత్సవం

రంగంపేట: మండల కేంద్రమైన రంగంపేట మంచినీటి చెరువు వద్ద నిర్మించిన గోవిందమాంబ సమేత శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మంద్రస్వామి ఆలయ ఏడో వార్షికోత్సవాలు ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా స్వామి, అమ్మవార్ల కల్యాణం ఘనంగా జరిపారు. అనపర్తి విశ్వ బ్రాహ్మణ సంఘం తాళాబత్తుల వీర బ్రహ్మనందం సమకూర్చిన పంచాంగాలను విశ్వబ్రాహ్మణ సంఘాలకు పంపిణీ చేశారు. అనంతరం వీరబ్రహ్మేంద్ర స్వామి ఉత్సవ విగ్రహాలను పల్లకిలో గ్రామంలో ఊరేగించారు. కార్యక్రమంలో విశ్వబ్రహ్మణ సంఘం అధ్యక్షుడు బి.అప్పలాచార్యులు, ఆలయ ధర్మకర్త సిద్ధాంతపు సత్తిబాబు, ముక్కపూడి బ్రహ్మజీ, ర్యాలి శ్రీనివాస్, డి.చినవెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీనరసింహావతారంలో వేంకటేశ్వరస్వామి



బిక్కవోలు: మండలంలోని కొంకుదురు బుడతల మామిడివద్ద ఉన్న పద్మావతి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామివారు భక్తులకు లక్ష్మీనరసింహావతారంలో దర్శనమిచ్చారు. ఆదివారం వసంత నవరాత్రుల్లో భాగంగా అర్చకులు రమణశర్మ ఆధ్వర్యంలో స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు హాజరై స్వామిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

చలివేంద్రం ప్రారంభం



జి.మామిడాడలో చలివేంద్రం ప్రారంభిస్తున్న ద్వారంపూడి ప్రభాకర్‌రెడ్డి

పెదపూడి: జి.మామిడాడ జెడ్పీ ఉన్నత బాలుర పాఠశాల వద్ద గొల్లల మామిడాడ రెడ్డి యూత్ వెల్ఫేర్ ఆధ్వర్యంలో చలివేంద్రం ప్రారంభించారు. ఎండలు పెరుగుతున్న నేపథ్యంలో బాటసారులకు మేలు చేసే ఉద్దేశంతో చలివేంద్ర ఏర్పాటుచేయడం అభినందనీయమని స్థానిక వైఎస్సార్‌సీపీ నేత ద్వారంపూడి ప్రభాకర్‌రెడ్డి అన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు కర్రి గంగాధర్‌రెడ్డి, గ్రామ ఉప సర్పంచ్ మేడపాటి తాతారెడ్డి, మండల పరిషత్ కోఆప్షన్ సభ్యుడు కర్రి వెంకటరెడ్డి, ఎంపీటీసీ సభ్యురాలు కర్రి వెంకటపద్మావతి, సత్తి భగవాన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌ఎంఎంఎస్‌కు ఆరుగురు విద్యార్థినుల ఎంపిక

అనపర్తి: నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్(ఎన్‌ఎంఎంఎస్)కు స్థానిక జెడ్పీ బాలికోన్నత పాఠశాలకు చెందిన ఆరుగురు విద్యార్థినులు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కె.సుజాత తెలిపారు. పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థినులు ఎం.షణ్ముఖప్రియ, శ్రీసత్యసాయి, ఎల్.మహాలక్ష్మి, పి.దేవిశ్రీ, వీవీఎస్ భానుశ్రీవల్లి, జి.ప్రసన్నసత్యలు ఎన్ఎంఎంఎస్‌కు ఎంపికయ్యారన్నారు. వీరికి నాలుగేళ్ల పాటు ఏటా రూ.12 వేల చొప్పున స్కాలర్‌షిప్ అందుతుందని ఆమె చెప్పారు. ఈ సందర్భంగా విద్యార్థినులతో పాటు పాఠశాల ఉపాధ్యాయులకు హెచ్‌ఎం అభినందనలు తెలియజేశారు.

కంప్యూటర్ కోడింగ్‌లో శిక్షణ

రాజానగరం: దివాన్ చెరువులోని డాక్టర్ వినయ్ సుంకర ఫౌండేషన్ కార్యాలయంలో నిరుద్యోగ యువతకు కంప్యూటర్ కోడింగ్‌లో అందించే ఉచిత శిక్షణ తరగతులు ఆదివారం ప్రారంభమయ్యాయి. రాజానగరం మండలంతో పాటు పరిసర మండలాల నుంచి 80 మంది యువత ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. కంప్యూటర్ కోడింగ్, జావా కోర్సులలో పాత తుంగపాడుకు చెందిన రాజాని జయప్రకాష్ శిక్షణను అందిస్తారు. ప్రతి ఆదివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఈ తరగతులు జరుగుతాయని ఫౌండేషన్ చైర్మన్ సుంకర వెంకటేశ్వరరావు తెలిపారు. కార్యక్రమంలో 'నన్నయ' వర్సిటీ తెలుగు అధ్యాపకులు డాక్టర్ తలారి వాసు, ఉపాధ్యాయులు అనురాధ, సుభాషిణి, స్థానికులు అప్పలరాజు పాల్గొన్నారు.

బాలుడి వైద్యానికి ఆర్థిక సాయం



బాలుడి కుటుంబ సభ్యులకు నగదు అందజేస్తున్న ఫ్రెండ్స్ హెల్పింగ్ యూత్ సభ్యులు

గోకవరం: అరుదైన బోన్‌మేరో వ్యాధికి గురై చెన్నైలో చికిత్స పొందుతున్న గోకవరానికి చెందిన బాలుడు పొట్నూరి అక్షయ్‌రామ్ వైద్యానికి స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్‌కు చెందిన 1996–2001 బ్యాచ్ విద్యార్థులు, ఫ్రెండ్స్ హెల్పింగ్ యూత్ సభ్యులు చేయూతనందించారు. అక్షయ్‌రామ్ పరిస్థితిపై చలించిన వారు రూ.40,700 నగదును సమకూర్చారు. ఈ మొత్తాన్ని ఆదివారం జెడ్పీ హైస్కూల్‌లో బాలుడి కుటుంబ సభ్యులకు అందజేశారు. వైద్యం విజయవంతమైన అక్షయ్‌రామ్ ఆరోగ్యంగా తిరిగి రావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పీఎంసీ చైర్మన్ కణితి శ్రీనివాస్, ముమ్మిడివరపు భాస్కర్, అరిగిల సాంబ, కంది సూరిబాబు, నెల్లిపూడి జగదీష్, బత్తుల సతీష్, కుప్పిరెడ్డి వెంకటేష్, కృష్ణ, బాబి పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

పెదపూడి: జి.మామిడాడ గ్రామంలోని జీఆర్ఎస్ఏ, ఫ్యామిలీ హెల్త్‌క్లబ్ నూతన కార్యవర్గాన్ని పూర్వపు అధ్యక్షుడు సబ్బెళ్ల మోహన్‌రెడ్డి అధ్యక్షతన ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ద్వారంపూడి వెంకటరెడ్డి, కార్యదర్శిగా డి.బ్రహ్మనందరెడ్డి, కోశాధికారిగా పడాల గంగాధర్‌రెడ్డి మరోసారి ఎన్నికయ్యారు. కార్యక్రమానికి తహసీల్దార్ టి.సుభాష్ ప్రత్యేక పరిశీలకునిగా హాజరై అవసరమైన సూచనలిచ్చారు. అనంతరం క్లబ్ ముఖ్య సలహాదారుడు మండ రాజారెడ్డి నూతన కార్యవర్గ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో క్లబ్ పూర్వపు అధ్యక్షుడు అప్పారెడ్డి, సబ్బెళ్ల శివన్నారాయణరెడ్డి, కాకినాడ రెడ్డి సంక్షేమ సంఘం కార్యదర్శి డి.శ్రీనివాస రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పేదల పక్షపాతి

- ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి
- అనపర్తి సావరంలో గడప గడపకూ మన ప్రభుత్వం



అనపర్తి సావరంలో సంక్షేమ పథకాల్ని వివరిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

అనపర్తి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల పక్షపాతి అని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. ఆదివారం అనపర్తి గ్రామ సచివాలయం–5 పరిధిలోని అనపర్తి సావరంలో నిర్వహించిన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. సావరంలో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా ఆయా కుటుంబాలకు కలిగిన లబ్ధిని వివరించారు. సంక్షేమ పథకాల అమలు, వలంటీర్ల పనితీరుపై ఆరా తీశారు. గ్రామస్తులు తన దృష్టికి తీసుకొచ్చిన సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారులు, సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. గడప గడపకూ కార్యక్రమంలో భాగంగా గ్రామానికి విచ్చేసిన ఎమ్మెల్యేకు మహిళలు మంగళ హారతులు పట్టి ఘన స్వాగతం పలికారు.

మాటకు కట్టుబడే వ్యక్తి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి

ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఏ రాష్ట్రంలో లేని విధంగా అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి ప్రజల మన్ననలు పొందుతున్నారని ఎమ్మెల్యే సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. కోవిడ్ అనంతరం ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఎదురైనా ఎన్నికల మానిఫెస్టోలో ప్రజలకు ఇచ్చిన మాటకు కట్టుబడి సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో జన్మభూమి కమిటీ పేరుతో టీడీపీ సానుభూతిపరులకు మాత్రమే సంక్షేమ పథకాలు అందేవన్నారు. తమ ప్రభుత్వంలో అర్హతే ప్రామాణికంగా కుల, మత, రాజకీయాలతో సంబంధం లేకుండా సంక్షేమ ఫలాలు నేరుగా అందిస్తున్నట్లు చెప్పారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీకి పట్టం కట్టి మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డికి ముఖ్యమంత్రిగా అవకాశం ఇస్తే దీనికి రెట్టింపు సంక్షేమాన్ని అందిస్తారని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ అంసూరి సూర్యనారాయణ, జెడ్పీటీసీ సత్తి గీతావరలక్ష్మి, సర్పంచ్ వారా కుమారి, వార్డు సభ్యులు వాసంశెట్టి కోటేశ్వరరావు, అరిగట్ల దుర్గాప్రసాద్, వాసంశెట్టి వెంకటేశ్వరరావు, కోనాల శ్రీనివాసరెడ్డి, లంకలపల్లి త్రిమూర్తులు, కురుపూడి శ్రీనివాసరావు, గుత్తుల రాఘవ, కాదా శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే చంటిబాబుకు సత్కారం



ఎమ్మెల్యే చంటిబాబును సత్కరించిన భూపతిపాలెం గురుకుల పాఠశాల విద్యార్థులు

గోకవరం: మండలంలోని భూపతిపాలెం గురుకుల పాఠశాల పూర్వ, ప్రస్తుత విద్యార్థులు ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబును ఆదివారం ఘనంగా సన్మానించారు. గోకవరం, జగ్గంపేట మండలాల సరిహద్దుల్లో అటవీ ప్రాంతం నడుమ భూపతిపాలెం గురుకుల పాఠశాల ఉంది. ఎన్నో ఏళ్లుగా ఈ పాఠశాలకు సరైన రోడ్డు మార్గం లేకపోవడంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. ఎమ్మెల్యే చంటిబాబు పలుమార్లు పాఠశాలకు వచ్చిన సందర్భంలో రోడ్డు పరిస్థితిని గుర్తించి జగ్గంపేట మండలం రాజపూడి నుంచి గోకవరం మండలంలోని భూపతిపాలెం వరకు రోడ్డు నిర్మాణానికి చర్యలు చేపట్టారు. ప్రస్తుతం ఈ రోడ్డు పనులు చురుగ్గా జరుగుతున్నాయి. ఆదివారం రోడ్డు నిర్మాణ పనులను పరిశీలించిన ఎమ్మెల్యే పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల పూర్వ విద్యార్థులు, ప్రస్తుత విద్యార్థులు ఎమ్మెల్యేను శాలువా, పూలమాలలతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. అలాగే రాజపూడి, కృష్ణాపురం, గోవిందపురం గ్రామస్తులు సైతం ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛాలు అందించి హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చంటిబాబు మాట్లాడుతూ తనకు భూపతిపాలెం గురుకుల పాఠశాల అంటే ఎంతో ఇష్టమన్నారు. ఇక్కడ చదువుకున్న వారు ఎందరో దేశ, విదేశాల్లో ఉన్నత స్థానాల్లో ఉన్నారని తెలిపారు. ప్రస్తుతం ఇక్కడ విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులు ప్రభుత్వ సదుపాయాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో గోకవరం మండల సచివాలయ కన్వీనర్ దాసరి రమేష్, ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి వరసాల ప్రసాద్, విత్తనాల అభివృద్ధి శాఖ రాష్ట్ర డైరెక్టర్ ఇళ్ల అప్పారావుకాపు, టౌన్ కన్వీనర్ చింతల అనిల్‌కుమార్, గుబ్బాలమ్మ ఆలయ చైర్మన్ నరాలశెట్టి నర్శయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆటో బోల్తా

సీతానగరం: మండలంలోని సింగవరం వద్ద ఆదివారం ఆటో బోల్తాపడి నలుగురికి స్వల్ప గాయాలయ్యాయి. ముందు వెళుతున్న వాహనాన్ని ఓవర్‌టేక్ చేసే సమయంలో అదుపుతప్పి ఏటిగట్టుపై నుంచి కిందకు ఆటో బోల్తా కొట్టింది. ఈ ఘటనలో ఆటో డ్రైవర్ చిరంజీవి, ప్రయాణికులు వెంకట్రావు, ఈ.మహేష్, కంద్రెల్లి సత్యనారాయణకు గాయాలయ్యాయి. క్షతగాత్రులకు 108 అంబులెన్స్ ఏఎంటీ ముత్యం శ్రీనివాస్, పైలట్ విజయ్ కుమార్ ప్రథమ చికిత్స చేసి, రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. నిడదవోలు మండలం సమిశ్రగూడెంలోని లోహిణి నగర్‌కు చెందిన వీరందరూ దేవీపట్నం మండలం గండిలో కొలువైన పోశమ్మను దర్శించుకుని, తిరిగివస్తుండగా ఈ ప్రమాదం జరిగింది.

నిడమర్తి సత్తిరాజుకు సత్కారం



సత్తిరాజును సత్కరిస్తున్న ఐక్యవేదిక నాయకులు

మధురపూడి: రాజానగరం మండలం దివాన్‌చెరువుకు చెందిన సామాజిక, ఆధ్యాత్మిక వేత్త నిడమర్తి సత్తిరాజుకు కోరుకొండ మండలం బుచ్చెంపేటలో ఆదివారం సత్కారం జరిగింది. ఉగాది సందర్భంగా రాజమహేంద్రవరంలో జరిగిన నంది పురస్కారాల వేడుకలో ఆయన అవార్డును అందుకున్నారు. ఈ నేపథ్యంలో మాదిగ ఐక్యవేదిక కోరుకొండ మండల శాఖ నాయకులు ఆయనను శాలువా, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. ఐక్యవేదిక కన్వీనర్ మద్దాల చంటిబాబు, నాయకులు ఇండుగమెల్లి సత్యనారాయణ, పైడిమళ్ల ధనరాజ్, కొమ్మరి సోమరాజు, జొన్నకూటి వందనకుమార్, శివ పాల్గొన్నారు.

పటిక బెల్లంతో తులాభారం

రాజానగరం: స్థానిక షిరిడీ సాయిబాబా ఆలయంలో కె.అర్జునరావు అనే యువకుడికి ఆదివారం పటిక బెల్లంతో తులాభారం వేశారు. బాబాను వేడుకున్న పని దిగ్విజయంగా జరగడంతో కుటుంబ సభ్యులతో సహా వచ్చి, తన మొక్కును చెల్లించుకుంటున్నానని ఆ భక్తుడు తెలిపాడు. ఎక్కువ మంది భక్తులు ప్రతి గురువారం ఈ ఆలయంలో సాయిబాబా సన్నిధిలో తులాభారాలు వేసి తమ మొక్కులు చెల్లించుకుని, మధ్యాహ్నం హారతి అనంతరం నిర్వహించే అన్నప్రసాద కార్యక్రమంలో పాల్గొని వెళ్తుంటారు.

ఓహెచ్‌ఆర్‌ల నిర్మాణం పూర్తి చేయాలి

- ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా
- అధికారులతో సమీక్ష



అధికారులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

రాజానగరం: జలజీవన్ మిషన్ పథకంలో భాగంగా నియోజకవర్గంలో చేపట్టిన 78 ఓవర్ హెడ్ ట్యాంక్ (ఓహెచ్‌ఆర్)ల నిర్మాణ పనులు సత్వరమే పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని స్థానిక ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా ఆదేశించారు. ఓహెచ్‌ఆర్ నిర్మాణ పనుల ప్రగతిపై ఆదివారం రాజమహేంద్రవరంలోని తన కార్యాలయంలో ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఎమ్మెల్యే రాజా మాట్లాడుతూ వీటి నిర్మాణాలు పూర్తయితే ప్రతి ఇంటికీ కుళాయిల ద్వారా తాగునీటి అందించాలనే లక్ష్యం నెరవేరుతుందన్నారు. వీటితోపాటు సంపూర్ణ పారిశుద్ధ్య కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో అవసరమైనచోట సీసీ డ్రెయినేజీల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలన్నారు. ముందుగా ఏ గ్రామాల్లో వీటి అవసరముందో గుర్తించి, తగిన విధంగా ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. ఎన్‌ఆర్‌ఈజీఎస్ పథకంలో వీటి పనులు చేపట్టేలా కృషి చేస్తామన్నారు. సమావేశంలో ఆర్‌డబ్ల్యూఎస్ డీఆర్‌ఈవో బాలశంకర్, డీఈ రవికుమార్, ఏఈ సుబ్బారావు పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నీ విజేత కోరుకొండ



విన్నర్ జట్టు కెప్టెన్ రాజారెడ్డికి కప్‌ను అందజేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

మధురపూడి: బాబూ జగ్జీవన్‌రామ్ జయంతిని పురస్కరించుకుని కోరుకొండ మండలం బూరుగుపూడిలో నిర్వహించిన ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలు ఆదివారంతో ముగిశాయి. 32 టీమ్‌లు తలపడిన ఈ టోర్నీలో విజేతగా కోరుకొండ, రన్నర్‌గా నిడిగట్ల నిలిచాయి. విన్నర్ టీమ్ కెప్టెన్ రాజారెడ్డికి వైఎస్సార్ రైతు విభాగం ఉమ్మడి జిల్లాల అధ్యక్షుడు అడబాల చినబాబు కప్ ప్రదానం చేశారు. రన్నర్ జట్టు కెప్టెన్ బద్రికి ఏఎంసీ చైర్మన్ నక్కా రాంబాబు కప్ అందజేశారు. మ్యాన్ ఆఫ్‌ది మ్యాచ్‌ను హౌసింగ్ బోర్డుకు చెందిన ముధుకు కోరుకొండ జెడ్పీటీసీ కర్రి నాగేశ్వరరావు అందజేశారు. కార్యక్రమంలో వ్యవసాయ సలహా మండలి జిల్లా సభ్యుడు కంటే వినయ్‌తేజ, బూరుగుపూడి పీఏసీఎస్ చైర్‌పర్సన్ బుడ్డిగ సత్తిబాబు, వైఎస్సార్ సీపీ నాయకులు పిట్టా కృష్ణ, మేకా రాజు, ఏడిద పండు, పిల్లి క్రాంతి, కుందేటి కిషోర్, బత్తిన నాని, పిల్లి సుధీర్ పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

సీతానగరం: రాపాక కోటికేశవరం రోడ్డులో అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను సీజ్ చేశామని ఎస్సై కె.శుభశేఖర్ ఆదివారం తెలిపారు. ఇనుగంటివారిపేట ఆకుల దుర్గకు చెందిన ట్రాక్టర్‌లో అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తుండగా పట్టుకున్నారు.

రూ.50 వేల ఆర్థిక సాయం

మధురపూడి: కోరుకొండ మండలం కాపవరానికి చెందిన క్షతగాత్రుడు కాపవరపు నాగుకు కోరుకొండ ఆర్యవైశ్య సంఘం ఆదివారం రూ.50 వేల సాయం అందజేసింది. కోరుకొండ లక్ష్మీనరసింహస్వామి తీర్థం సందర్భంగా జరిగిన రథోత్సవంలో కాపవరపు నాగు క్షతగాత్రుడయ్యాడు. ఈ నేపథ్యంలో ఆయనను ఆర్యవైశ్య సంఘం నాయకులు పరామర్శించారు. సంఘం అధ్యక్షుడు బొండాడ చందు ఆధ్వర్యంలో నాయకులు నగదు సహకారాన్ని అందించారు. వక్కలగడ్డ బుజ్జి, వాకచర్ల గోపి, గ్రంధి కాశీ, మామిడిపాక శేషాచలం, కారుమూరి బాబ్జీ పాల్గొన్నారు.

రక్తదాన శిబిరానికి స్పందన



శిబిరంలో రక్తదానం చేస్తున్న దృశ్యం

రాజానగరం: స్థానిక శ్రీలక్ష్మీగణపతి గూడ్స్ ఆటో యూనియన్ ఆధ్వర్యంలో రాజానగరంలో ఆదివారం నిర్వహించిన రక్తదాన శిబిరానికి మంచి స్పందన లభించింది. రావుల చెరువు గట్టున ఉన్న ఆటో స్టాండ్ వద్ద ఉదయం 9 గంటల నుంచి ప్రారంభమైన ఈ శిబిరంలో 65 మంది రక్తదానం చేశారు. తలసేమియా వ్యాధితో బాధపడే పిల్లలకు అవసరమైన రక్తం సకాలంలో అందక ప్రాణాలు కూడా పోతుంటాయి. అటువంటి వారిని దృష్టిలో పెట్టుకుని రక్తదానం ద్వారా ప్రాణాలు కాపాడవొచ్చనే ఉద్దేశంతో ఈ శిబిరాన్ని నిర్వహించామని నిర్వాహకులలో ఒకరైన జనపరెడ్డి ప్రసాద్ తెలిపారు. సంజీవని బ్లడ్ బ్యాంక్ సిబ్బంది ప్రకాష్, రాజు జీఎస్ఎల్ వైద్య కళాశాల విద్యార్థులు సహకారంతో రక్త సేకరణ జరిగింది.

మహిళా పక్షపాత ప్రభుత్వమిది



మహిళలకు ఆసరా చెక్కు అందజేస్తున్న ఎంపీపీ తులసి, జెడ్పీటీసీ సభ్యురాలు వెంకటలక్ష్మి

పెదపూడి: రాష్ట్రంలో మహిళా పక్షపాత ప్రభుత్వం పాలన సాగిస్తుందని ఎంపీపీ కేతా తులసి అన్నారు. రాజుపాలెం, పైన గ్రామాల్లో ఆదివారం మూడో విడత వైఎస్సార్ ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని ఆమె జెడ్పీటీసీ సభ్యురాలు పేపకాయల వెంకటలక్ష్మితో కలిసి నిర్వహించారు. ఆసరా రూపేణా రెండు గ్రామాలకు విడుదలైన రూ.7,59,556 నమూనా చెక్కును మహిళా సంఘాల సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ తులసి మాట్లాడుతూ రాష్ట్రంలో అక్కచెల్లెమ్మలకు విద్య, ఆర్థిక, సామాజిక, రాజకీయ, సాధికారత కల్పించాలని తపిస్తున్న ప్రభుత్వమే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమన్నారు. మహిళలు అన్ని విధాలుగా ఎదగాలని, బాగుపడాలని అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తూ సీఎం జగన్ పాలన సాగిస్తున్నారన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు సుందరపల్లి ప్రమీల, గుత్తుల పుష్పవతి, వైఎస్సార్ క్రాంతి పథం ఇన్‌చార్జి ఏపీఎం చినబాబు, సీసీ పుష్పలత, ఎంపీటీసీ సభ్యులు సుధాకర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.